క్లుప్తంగా

రెడ్‌క్రాస్‌లో రక్తదానం



రక్తదానం చేస్తున్న చిరంజీవి అభిమానులు

నెల్లూరు(బారకాసు): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖకు చెందిన స్థానిక మద్రాస్ బస్టాండ్ సమీపంలోని బ్లడ్‌బ్యాంక్‌లో ఆదివారం చిరంజీవి అభిమానులు రక్తదానం చేశారు. ఇంద్ర, రబ్బానీ ఆధ్వర్యంలో చిరంజీవి యువత అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు రవికుమార్ అధ్యక్షతన తొలుత సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకను నిర్వహించారు. శిబిరంలో 150 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కన్వీనర్ సాయిరాం, బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ అజయ్ బాబు, మోటివేటర్ మధుసూదన్‌రావు, బ్లడ్ సెంటర్ సిబ్బంది కృష్ణవేణి, ఝాన్సీ, హరికుమార్‌రెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్ భూమనకు సన్మానం



నెల్లూరు(టౌన్): టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని పెన్నా సిమెంట్స్ పౌర సంబంధాల అధికారి వైఎస్ దీపకర్‌రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతిలోని చైర్మన్ నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట హనుమాన్ చాలీసా దుర్గాప్రసాద్ స్వామి ఉన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

ఇందుకూరుపేట: మండలంలోని పాములవారిపాళెంలో ఆదివారం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మస్తాన్‌బీకి కోడలు వహీదాకు ఇంటి విషయమై వివాదం జరిగి కోర్టును ఆశ్రయించడంతో అత్తకు అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో శనివారం పోలీసులు మస్తాన్ బీకి ఇంటిని అప్పజెప్పారు. కాగా ఇరువురూ ఆదివారం మరోసారి వివాదానికి దిగారు. మస్తాన్‌బీ వైపు ఆమె కుమారులు, వహీదా వైపు ఆమె కూతురు మరో ఇద్దరు ఉన్నారు. వీరంతా వివాదానికి దిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో గాయాలపాలవడంతో వారిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. ఈ విషయమై సమాచారం అందడంతో పోలీసులు విచారిస్తున్నారు.

అద్దాల మండపం అద్భుతం



మండపంలో లోపల ఇలా..

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడ ఆలయంలో నూతనంగా నిర్మించిన అద్దాల మండపం భక్తులు విశేషంగా ఆకట్టుకుంటోంది. అభివృద్ధి పనుల్లో భాగంగా గతంలో ఆలయ ఆవరణలో ఉన్న మండపాన్ని తొలగించినట్లు చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. నెల్లూరుకు చెందిన పోట్ల దశరథరామయ్య – యానాదమ్మ దంపతులు దాతలుగా వ్యవహరించి అన్ని హంగులతో అద్దాల మండపాన్ని కట్టించారు. ప్రస్తుతం శ్రావణమాసం సందర్భంగా ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు అద్దాల మండపాన్ని తిలకిస్తున్నారు. అక్కడ స్వామి అమ్మవార్ల విగ్రహాలను ఏర్పాటు చేశారు.

జొన్నవాడలో ర్యాలీ

బుచ్చిరెడ్డిపాళెం: దోమల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని జొన్నవాడలో ఆదివారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యురాలు ప్రత్యూష మాట్లాడుతూ దోమల వ్యాప్తికి నివారణకు అందరూ కృషి చేయాన్నారు. దోమల వల్ల డెంగీ, మలేరియా తదితరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతిఒక్కరూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది సుబ్బమ్మ, నాగరాజు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల్లో వెలుగులు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగులకు అన్ని విధాలుగా అండగా ఉన్నారు. వారికి మేలు జరిగేలా అనేక నిర్ణయాలు తీసుకున్నారు. తాజాగా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచడంతోపాటు, ఉచిత బీమా సదుపాయం కల్పించారు. దీంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– నెల్లూరు(వీఆర్సీసెంటర్)



ఆనందంగా ఉంది



నేను 2012 సంవత్సరం నుంచి షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నా. చాలీచాలని జీతాలతో కష్టాలు పడుతున్న మాలాంటి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలను 37 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. థాంక్యూ సీఎం సార్.

– అవుల మనోజ్‌కుమార్, షిఫ్ట్ ఆపరేటర్

చెప్పాడంటే చేస్తాడంతే..



విద్యుత్ సంస్థలోపనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించేలా సీఎం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే అవుట్ సోర్సింగ్ ఉద్యోగస్తుల జీతాలు పెంచారు. దీంతో నెలకు రూ.5 వేల నుంచి రూ.6 వేలు వరకు జీతాలు పెరుగుతాయి. ఈ స్థాయిలో జీతాలు పెంచుతారని కలలో కూడా ఊహించలేదు. ఆయన చెబితే చేస్తాడంతే.

– సీహెచ్ పతంజలి, కంప్యూటర్ ఆపరేటర్

సీఎంకు ధన్యవాదాలు



విద్యుత్ సంస్థలోఅవుట్ సోర్సింగ్ విధానంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నా. మాలాంటి వారి భవిష్యత్ కోసం సీఎం ఆలోచన చేసి వేతనాలు పెంచటంతోపాటు, మా కుటుంబ సభ్యులతో సహా ఉచిత బీమా సదుపాయాన్ని వర్తింపజేయడం ఎంతో సంతోషంగా ఉంది. మా కుటుంబసభ్యుల తరపున సీఎంకు ధన్యవాదాలు.

– ఎస్కే ఇంతియాజ్, కంప్యూటర్ ఆపరేటర్

మాజీ ప్రధానికి ఘన నివాళి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దేశ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఘన నివాళులర్పించారు. స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వద్ద ఉన్న రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి, నాయకులు సీవీ శేషారెడ్డి, సురేష్ బాబు, ఫయాజ్, అనిల్, మోహన్, గణేష్, రాజా తదితరులు పాల్గొన్నారు.



నివాళి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఇస్కాన్ మందిరంలో విద్యార్థులకు పోటీలు



మాట్లాడుతున్న డాక్టర్ సుఖదేవ్ స్వామి



కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

నెల్లూరు(బృందావనం): వచ్చే 7వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు, 8న శ్రీల ప్రభుపాద వ్యాసపూజ సందర్భంగా మినీబైపాస్‌రోడ్డు ఇస్కాన్ సిటీలోని ఇస్కాన్ మందిరంలో ఆదివారం విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రెస్, పాటలు, శ్లోక ఉచ్చారణ, కలరింగ్, డ్రాయింగ్, గ్రీటింగ్, క్రాఫ్ట్ ఆర్ట్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్ మందిరం) నెల్లూరు శాఖ చైర్మన్ డాక్టర్ సుఖదేవ్ స్వామి ఉపన్యసించారు. బాల్యం నుంచి భక్తిభావం, సృజనాత్మకత వెల్లివిరియాలన్నారు. ధ్యానం, యోగంతో భగవన్నామ సంకీర్తన ఎంతో ముఖ్యమన్నారు. జీవితంతోపాటు జీవన విలువలు తెలియాలంటే, పరివర్తన కలగాలంటే కృష్ణ నామాన్ని జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మందిరంలో కొలువైన బలరామసుభద్ర జగన్నాథమూర్తులకు ప్రత్యేక పూజలు జరిగాయి. భజనలు, కీర్తనలు నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు రోజూ ఇస్కాన్ మందిరంలో రాధాకృష్ణుల ఊంజల్‌సేవలు, భజనలు, బలరామజయంతి, శ్రీకృష్ణబలరాములకు అభిషేకాలు, భాగవత సత్సంగం తదితర కార్యక్రమాలను సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల నిర్వహిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 7, 8న పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

చిన్నారులతో కళకళ

ఇస్కాన్ మందిరం చిన్నారుల వేషధారణలతో కళకళలాడింది. కృష్ణుడు, రాముడు, బలరాముడు, సుధాముడు, నారదుడు, హనుమంతుడు, లక్ష్మీదేవి, గోపికలు, గణేష్, శంకరుల వేషధారణలతో చిన్నారులు పోటీల్లో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేదపారాయణం

నెల్లూరు(బృందావనం): పొగతోట గాంధీనగర్‌లో శ్రీఆదిశంకర ధ్యాన మందిరంలో చక్రాల వారి ట్రస్ట్ పర్యవేక్షణలో ఇరగవరం వేదశాస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో వేదపారాయణ సప్తాహం ఆదివారం కొనసాగింది. జగద్గురు విధుశేఖర భారతి స్వామి జన్మదిన వేడుకల్లో భాగంగా శ్రీకృష్ణయజుర్వేద మూల పారాయణం, ఆమూలాగ్ర అరుణపారాయణం నిర్వహించారు. సురభి మహాలక్ష్మి శివానందలహరి స్తోత్రంపై ఉపన్యసించారు. కార్యక్రమంలో విజయవాడ గన్నవరం శ్రీభువనేశ్వరి పీఠాధీశులు కమలానందభారతి స్వామి అనుగ్రహ ఆశీస్సులు అందజేశారు ఇరగవరం వేద శాస్త్ర పరిషత్ ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు, చెన్నైకి చెందిన ఐఆర్ఎస్ అధికారి బ్రహ్మశ్రీ వేమూరి సత్యనారాయణమూర్తి పాల్గొని సందేశమిచ్చారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులు పత్రి రమణమూర్తి, అన్నవరం సత్యనారాయణ, తంగిరాల వెంకటశ్రీకాంత్‌శర్మ, చక్రాల వేంకట లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాలను చక్రాల ఆనందకుమార్, బ్రహ్మశ్రీ గుళ్లపల్లి శివశర్మ పర్యవేక్షించారు.



సత్యనారాయణమూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

సేవా భారతి ఆధ్వర్యంలో వైద్యశిబిరం

నెల్లూరు(బృందావనం): సేవా భారతి నెల్లూరు నగర శాఖ ఆధ్వర్యంలో కోటమిట్ట జై భజరంగ వ్యాయామశాల ప్రాంగణంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జయభారత్ హాస్పిటల్ డాక్టర్ చైతన్య రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా భారతి సమన్వయకర్త కనగలూరు స్వామి మాట్లాడుతూ పి.వెంకయ్య స్మృత్యర్థం ఆయన భార్య అంజమ్మ కుటుంబసభ్యుల సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి 57 మంది రోగులకు చికిత్స అందించామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నగర కార్యవాహ కె.శ్రీకాంత్, మధు తదితరులు పాల్గొన్నారు.



డయల్ యువర్ కమిషనర్ నేడు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 9.30 నుంచి 10.30 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, 0861 – 2355678 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయాలన్నారు. అలాగే స్పందన కార్యక్రమంలో అర్జీలను సమర్పించాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని డైకస్ రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11 కేవీ ఫత్తేఖాన్‌పేట విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ నెల్లూరుటౌన్ ఈఈ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఫత్తేఖాన్‌పేట, రమేష్‌రెడ్డి నగర్, రైతుబజారు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు సరఫరా ఉండదేని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చిరంజీవి జన్మదిన వేడుకలు రేపు

నెల్లూరు(బృందావనం): సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో పురమందిరంలో ఈ నెల 22వ తేదీన సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలు సాయంత్రం 5 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకల్లో భాగంగా 'జై చిరంజీవా.. జగదేకవీరా..' సంగీత విభావరి, క్రేజీ డ్యాన్స్ షో, కేక్ కటింగ్, మిఠాయిల పంపిణీ, పేదలకు వస్త్రదానం, రక్తదాతలకు సన్మానం జరుగుతాయని వివరించారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. చిరంజీవి అభిమానులు, కళాకారులు, సంగీతాభిమానులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

జిల్లాస్థాయి యోగా పోటీలు



విజేతలతో నిర్వాహకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలో ఆదివారం షిర్డీసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యోగా పోటీలు జూనియర్, సీనియర్ విభాగాల్లో జరిగాయి. విజేతలకు కేంద్ర సమాచార శాఖ అధికారి నాగసాయి సూరి బహుమతులు అందజేశారు. విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆ అసోసియేషన్ నిర్వాహకులు పెంచలయ్య, విజయకుమార్‌రెడ్డి తెలిపారు.

ఆదాలకు కళాత్మక స్వాగతం



నెల్లూరు(బృందావనం): నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డికి సోమా పద్మారత్నం కళాత్మక స్వాగతం పలికారు. నెల్లూరు రూరల్ పరిధిలో 18వ డివిజన్ హరనాథపురం నాగసాయి మందిరం వద్ద ఆదివారం ఓ కార్యక్రమంలో ఆదాల పాల్గొన్నారు. రావిఆకుపై వాటర్ కలర్స్‌తో ఆదాల చిత్రాన్ని తీర్చిదిద్ది ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తోటకూర అశోక్ పాల్గొన్నారు.

మరోసారి సత్తా చాటాం : కాకాణి

మనుబోలు: నియోజవర్గంలో వార్డులకు జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను గెలిపించుకుని మరోసారి సత్తా చాటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. జగనన్న ఇళ్ల లబ్ధిదారులైన గిరిజన కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని మనుబోలు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆదివారం మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప ఎన్నికల్లో గెలిచిన వార్డు సభ్యులను కాకాణి అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఎక్కడైనా గొడవలు జరిగితే దాన్ని సాకుగా చూపి దౌర్జన్యం చేసి గెలిచారని ప్రచారం చేసేందుకు టీడీపీ నాయకులు సిద్ధమయ్యారన్నారు. అయితే ఎన్నికలు ప్రశాంతంగా ముగిసి వారి అడ్రస్ గల్లంతవడంతో ఎక్కడో దాక్కున్నారని చెప్పారు. తాము బలపరిచిన అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, సర్పంచ్‌లు వేణుగోపాల్, ఏడుకొండలు, వెంకటరమణయ్య, ఎంపీటీసీ రాజేశ్వర్మ, నాయకులు హరగోపాల్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, సాయిమోహన్‌రెడ్డి, ధనుంజయ రెడ్డి, రమేష్, మహేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి కాకాణితో వార్డు సభ్యులు

పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం



ఆర్డీటీ కాలనీ పార్టీలో చేరిన వారితో ఎంపీ ఆదాల

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని నెల్లూరు ఎంపీ, ఆ పార్టీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన వారు భారీ సంఖ్యలో ఆదివారం ఎంపీ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. 31వ డివిజన్‌కు చెందిన నాయబ్ ఆధ్వర్యంలో 150 మంది ఎంపీ నివాసంలో, కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు ఆర్డీటీ కాలనీలో అరవ కామాక్షి ఆధ్వర్యంలో 250 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎంపీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు జరుగుతున్నా టీడీపీ నాయకులు విమర్శలు చేయడం దారుణమన్నారు. పార్టీ బలోపేతానికి సమష్టి కృషి ఎంతో అవసరమన్నారు. స్థానికుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



31వ డివిజన్‌కు చెందిన వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ

ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

నెల్లూరు(బృందావనం): భారతీయ సనాతన ధర్మంలో ఆలయాలకు ఉన్న స్థానం ఎంతో విశిష్టమైందని, ఆలయాల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని విజయవాడ గన్నవరం భువనేశ్వరి పీఠం పీఠాధిపతి కమలానంద భారతి స్వామి తెలిపారు. రంగనాయకులపేట ఉప్పరపాళెంలో సీతారామ సమేత కోదండరామస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో భాగంగా మూడో రోజు ఆదివారం జరిగిన పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపన్యసిస్తూ ప్రతి గ్రామంలో ఆలయాలు తప్పనిసరి అన్నారు. ధర్మ సింధు ఆధ్యాత్మిక సేవా సమితి పర్యవేక్షణలో జరిగిన ప్రతిష్టా మహోత్సవంలో ఆలయ ధర్మకర్త నక్కా శ్రీనివాసులు, కమిటీ సభ్యులు కందుల మోహన్‌బాబు, లక్ష్మి, ఎన్వీ సుబ్రహ్మణ్యం, ఊటుకూరు హరికృష్ణ, లెక్కల కిశోర్, సమితి నిర్వాహకులు ధన్వి శ్రీనివాస్, మహంకాళి వెంకటేష్, నాగూరు, సిద్ధయ్య, నవీన్, పద్మజ తదితరులు పాల్గొన్నారు.



కమలానంద భారతిస్వామికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

అపోలో ఆస్పత్రిలో 100 రోబోటిక్ శస్త్రచికిత్సలు

నెల్లూరు(బారకాసు): నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్లో వంద రోబోటిక్ మోకాలి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేశారు. ఆర్థోపెడిక్ సీనియర్ కన్సల్టెంట్, రోబోటిక్ కీ సర్జరీస్ స్పెషలిస్ట్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ వివేకానంద రెడ్డి, డాక్టర్ శశిధర్‌రెడ్డి, డాక్టర్ పమ్మి కార్తీక్‌రెడ్డి బృందం ఈ ఘనతను సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా స్థానిక అపోలో హాస్పిటల్లో ఆదివారం విలేకరుల సమావేశంలో డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డితోపాటు సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాం సతీష్, సీఈఓ నవీన్ వివరాలు వెల్లడించారు. సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే ఈ రోబోటిక్ శస్త్రచికిత్స ఎంతో సురక్షితమని చెప్పారు. హాస్పిటల్లో అత్యాధునిక వైద్య పరికరాలను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. అంతేకాకుండా వైద్య వృత్తిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా శిక్షణ తీసుకుంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామని తెలిపారు. అందువల్లే అతి తక్కువ కాలంలో వంద రోబోటిక్ మోకాలి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు.



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, వైద్య బృందం

రవాణా శాఖ అధికారులకు క్రికెట్ పోటీలు



పోటీలో పాల్గొన్న రవాణా శాఖ అధికారులు, సిబ్బంది

నెల్లూరు(టౌన్): రవాణా శాఖ కార్యాలయాల్లో విధి నిర్వహణలో నిమగ్నమయ్యే అధికారులు, సిబ్బంది ఆదివారం క్రికెట్ మ్యాచ్ ఆడారు. జిల్లా పరిధిలోని నెల్లూరు, ఆత్మకూరు, కావలి, కందుకూరు కార్యాలయాల్లో పనిచేస్తున్న వారికి బుజబుజనెల్లూరు ప్రాంతంలోని క్రికెట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంధ్రా స్టేడియం (ఐసీఏ)లో ఆదివారం టీ20 మ్యాచ్ జరిగింది. నెల్లూరు రాయల్స్ టీంకు డీటీసీ చందర్, కావలి కింగ్స్ టీంకు ఆర్టీఓ సుధాకర్‌రెడ్డి కెప్టెన్లుగా వ్యవహరించారు. టాస్ గెలిచిన నెల్లూరు రాయల్స్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. కావలి కింగ్స్ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 147 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు రాయల్స్ జట్టు 17 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 148 పరుగులు చేసి విజయం సాధించింది. ఏఎంవీఐ స్వప్నీల్‌కుమార్‌రెడ్డిని ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా, ఉత్తమ బౌలర్‌గా హోంగార్డు ఆదినారాయణ, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నెల్లూరు రవాణా కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్యను ఎంపిక చేసి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా డీటీసీ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది మానసికఒత్తిడిని అధిగమించేందుకు క్రికెట్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.

హుషారుగా.. ఆనందంగా..

నెల్లూరు చిల్డ్రన్స్ పార్క్‌లో ఆదివారం చిన్నారులు, పెద్దలు సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు ఊయల ఊగుతూ ఆనందంగా గడిపారు. పలువురు ఓపెన్ జిమ్‌లో వ్యాయామాలు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు





